మనసున్న నాయకుడు సీఎం జగన్

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- జీవీఎంసీ 5వ వార్డులో రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులు

మధురవాడ : ప్రజలకు మంచి చేయడానికి కావాల్సింది పెద్ద వయస్సు కాదని పెద్ద మనసని, అటువంటి మంచి మనసున్న నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డులోని మారికవలస జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ ఆర్‌జీకే పాత కాలనీ ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి కొత్త కాలనీ (వైట్ బిల్డింగ్స్) వరకు హైవేని ఆనుకుని రూ.35 లక్షలతో సర్వీసు రోడ్డు, కొమ్మాది జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ వైఎస్సార్ కాలనీ నుంచి పెట్రోల్ బంక్ వరకు హైవేని ఆనుకుని రు.30 లక్షలతో సర్వీసు రోడ్డు, బొట్టవానిపాలెం, చాకలిపేటలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు, సాయిరాం కాలనీలో ఎస్‌టీబీఎల్ వెనుక రూ.14.70 లక్షలతో వీఆర్‌సీసీ కాలువ, సుమారు రూ.1.15 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శనివారం మధ్యాహ్నం శిలాఫలకాలు ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. అనంతరం బొట్టవానిపాలెం పాఠశాల వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కేవలం జీవీఎంసీ 5వ వార్డులోనే రూ.100 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మంచి జరిగిందని నమ్మితేనే ఓటు వెయ్యమని ప్రజలను అడిగే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అర్హులందరికీ వివక్షకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు. సంక్షేమ పథకాలు, వలంటీర్, సచివాలయ వ్యవస్థ, ఇంటి వద్దకే పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అనంతరం శివశక్తినగర్ మహిళలు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు.

టీడీపీ పాలనలో దోచుకోవడమే...

టీడీపీ పాలన అంతా జన్మభూమి కమిటీల పేరుతో దండుకో... దోచుకో... అన్నట్లు సాగిందన్నారు. ప్రతి పనికీ సిఫార్సులు, లంచాలు, ఆఫీసులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. మళ్లీ మోసం చేయడానికి పచ్చ పార్టీలు, సినిమా పార్టీలు వస్తాయని, అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీలు డి.లక్ష్మి, కె.కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ మొల్లి హేమలత, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, ముగడ రమణ (ఎమ్‌వీఆర్), బండారు శివలక్ష్మి, చేకూరి రజని, మన్యాల సోంబాబు, జేఎస్ రెడ్డి, వై.శ్రీనివాసరావు, రుషికేష్, రమణమ్మ, కావ్యారెడ్డి, గాయత్రి, అప్పారావు భవానీ, ముచ్చు రామారావు, బగాది లక్ష్మణ, తమ్మినేని వరలక్ష్మి, బెల్లాపు పాపారావు పాల్గొన్నారు.



మారికవలసలో మహిళలతో కలిసి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బొట్టవానిపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బొట్టవానిపాలెంలో జై జగన్ అంటూ నినదిస్తున్న మహిళలు



రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

క్లుప్తంగా

పేద విద్యార్థినికి రూ.10 వేల సాయం



విద్యార్థిని జెస్సీకి నగదు అందిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని జమ్మి చెరువు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థినికి శనివారం ఆర్థిక సాయం అందించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థిని మేడపాటి జెస్సీ చదువు కోసం వాకర్స్ క్లబ్ సభ్యుడు శేషాద్రి రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో నాయవాది ఎన్.జానార్దనరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌తో విద్యార్థులు, ఎంఈవో శివరాణి, ఉపాధ్యాయులు, తదితరులు

తగరపువలస: నేరెళ్లవలసలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయంలోని 26 మంది టెన్త్ విద్యార్థులకు శనివారం భీమిలి ఎంఈవో శివరాణి చేతుల మీదుగా దివీస్ లేబొరేటరీ పరీక్షా మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీఈబీ రూపొందించిన మెటీరియల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో బి.మంగపతి రావు, ఏఎల్‌సీఈవో జి.శ్రీనివాసరావు, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు పి.శేఖర్‌బాబు, పి.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

95 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం: కీతినిపేట వద్దనున్న సన్‌స్కూల్‌లో శనివారం రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎన్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు సహకారం అందించాయి. శిబిరంలో 95 మంది పాల్గొని రక్తదానం చేశారు. కంటి వైద్య శిబిరంలో 175 మందిని పరీక్షించి 48 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఈ సందర్భంగా బీఎన్‌డబ్ల్యూ అధ్యక్షుడు కై తపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కంటి వైద్య శిబిరంలో గుర్తించిన వారికి త్వరలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. సభ్యులు డాక్టర్ ఎన్.ఎల్.రావు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య, వెంపాడ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు



నమ్మివానిపేటలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డులో రూ.70 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ఎస్.కరుణాకరరెడ్డి అన్నారు. నమ్మివానిపేటలో రూ.18 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, పీతల వెంకట అప్పారావు, చేట్ల శ్రీనివాసరెడ్డి, సరగడ నాగిరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, నమ్మి మాధవరావు, చిల్ల ప్రమీల, వాసుపల్లి నరేంద్ర, మేడ సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో దుర్గాలమ్మ అమ్మవారు



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బొగ్గరోడ్డు దుర్గాలమ్మ ఆలయ రెండో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ, మణికర శివకుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు.

మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఆలయ కమిటీ ప్రతినిధులు రంగూరి రాంబాబు, చిల్ల అప్పలసూరిరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి, సరగడ నరసింగరావు, మునకాల ఆదినారాయణరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చేట్ల త్రినాథరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, పిట్ట వెంకటరావు, దుంప అప్పలనాయుడు, చేట్ల రమణ, చిల్ల ఆదినారాయణరెడ్డి, చిల్ల నరసింహులు, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, కొనన సూరి, నందిక రమణ, నీలాపు శంకరరెడ్డి, జీరు శివారెడ్డి, పినిశెట్టి చిన్ని, జీరు రాము, దల్లి కొత్తయ్య, జీరు శ్రీనివాసరెడ్డి, ఎర్నింటి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి పల్లకీ సేవ



అమ్మవారి వెంట కలశాలతో సాగుతున్న మహిళలు



పద్మనాభంలో కన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఏడో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పరిషత్, నవగ్రహ మండపారాధన చేశారు. 108 మంది ముత్తైదవులు కుంకుమ పూజ చేశారు. మహిళలు వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని పల్లకీలో పద్మనాభం, కృష్ణాపురం గ్రామాల్లో ఊరేగించారు. మరికొంత మంది 102 కలశలు పట్టుకుని అమ్మవారి విగ్రహం వెంట సాగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిడతలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ కంటుబోతు రాంబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అనుమాలశెట్టి శ్రీనివాస రావు, కోశాధికారి ముప్పడి సుందరరావు, జె.నరిసింహమూర్తి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాకమర్రిలో పశు వికాస్

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రిలో శనివారం ఎస్ఎమ్ఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ కంపెనీ నిర్వహించిన పశువికాస్ కార్యక్రమంలో 180 పశువులకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. అలాగే స్థానికులకు కూడా వైద్య సేవలు అందించారు. 100 మందికి రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా ముంబయికి చెందిన సంస్థ మేనేజర్ విశాల్ షిండే తమ సంస్థ అందిస్తున్న సేవలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, వైఎస్సార్‌సీపీ పద్మనాభం అధ్యక్షుడు కోరాడ లక్ష్మణ, నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, కరుభక్త వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



క్రెడిట్ సొసైటీ సేవలు వివరిస్తున్న సంస్థ మేనేజర్ విశాల్ షిండే

సీఎం జగన్ పాలనలో విద్యకు స్వర్ణయుగం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలించిన ఈ ఐదేళ్ల కాలం విద్యకు, విద్యార్థులకు స్వర్ణయుగమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిట్టివలస బంతాట మైదానంలో జరుగుతున్న భీమిలి కేథరిన్ విద్యాసంస్థల 40వ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజు ఆయన మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడేలా విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం చదువులు, ట్యాబ్‌లు, తల్లులకు అమ్మ ఒడి సాయం అందిస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఇంగ్లిష్ మీడియం అందించాలన్న సేవా భావంతో 40 ఏళ్ల క్రితం ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు రతన్ రాజ్, సత్యబాల కలిసి కేథరిన్ విద్యాసంస్థలను స్థాపించారన్నారు. ఇక్కడ చదువుకున్న అనేక మంది విద్యార్థులు వివిధ అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నందున వారు మాతృభూమికి సేవలు అందించాలని కోరారు. ఆకాశమే హద్దుగా సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్ జొనాథన్, ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభ, మేధస్సును దేశాభివృద్ధికి వినియోగించాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి, డైరెక్టర్ సుష్మా ఇవాంజలిన్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2.1 లక్షల విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.సంకేత, శ్రావ్య రూ.1,00,116 విరాళం, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గేదెలపేటకి చెందిన గేదెల రాజేష్ దంపతులు రూ.1,10,000 విరాళం శనివారం అందజేశారు. సంబంధిత విరాళాలను సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయం వద్ద నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు బాండ్‌లను పీఆర్వో అప్పలనాయుడు అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో అప్పలనాయుడు

సనాతన ధర్మాన్ని వారసత్వంగా అందించాలి

సబ్బవరం: సనాతన ధర్మాన్ని, వేదాల సారాన్ని దేశంలోని యువతకు వారసత్వంగా అందించాలని సప్త రుషి ఆశ్రమం, వేద పాఠశాల వ్యవస్థాపకులు మావుళ్లపల్లి మాధవశర్మ కోరారు. సప్తరుషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన వేద భారత పరిక్రమ యాత్ర విజయోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా ప్రతీ ఒక్కరికీ జగద్గురు ఆది శంకరాచార్యులు ఆదర్శనీయమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. శంకరులు 32 సంవత్సరాల వయసులోనే భారతావనిని నాలుగు సార్లు చుట్టివచ్చి, సనాతన ధర్మాన్ని కాపాడటంతో పాటు ధర్మ సంస్థాపనార్థం నాలుగు దిక్కుల్లో నాలుగు పీఠాలను స్థాపించారన్నారు. ఆయన సందేశాన్ని, వేదాల సారాంశాన్ని విశ్వ వ్యాప్తం చేసి, ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలన్నారు. శంకరాచార్యులు పలు స్తోత్రాలు, గ్రంథాలు, భాష్యాలు రచించారన్నారు. 35 రోజుల పాటు తాము నిర్వహించిన వేద పరిక్రమ యాత్రలో దేశంలోని పలు పవిత్ర స్థలాలను దర్శించుకోవడంతో పాటు పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించి హిందూ ధర్మాన్ని వ్యాప్తిచేయడంలో భాగంగా వేద పారాయణం, అనేక హోమాలు జరిపించినట్లు తెలిపారు. ముందుగా జ్యోతిష్య, న్యూమరాలజీ పండితులు డాక్టర్ నారాయణమూర్తి పట్నాయక్, పోలాప్రగడ సుబ్బారావు తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాధవశర్మను ఘనంగా సత్కరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సప్తరుషి వ్యవస్థాపకుడు మాధవశర్మ

అందమైన గోడలపై సెప్టిక్ క్లీన్ స్టిక్కర్ల గలీజు

- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- అసహనం వ్యక్తం చేస్తున్న నివాసులు



సంతపేటలో స్టిక్కర్లు అంటిస్తున్న యువకుడు



భీమిలి జోన్‌లో గోడలకు అంటిస్తున్న స్టిక్కర్లు



సంతపేటలో ఒకే గోడకు అంటించిన స్టిక్కర్లు

తగరపువలస : జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఇటీవల తగరపువలసలో పర్యటించినప్పుడు గోడలు, ప్రభుత్వ భవనాల గోడలపై అంటించి ఉన్న స్టిక్కర్లు, పోస్టర్లు చూసి శానిటేషన్ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా గోడలపై పోస్టర్లు అంటిస్తున్న చిట్టివలస గణేష్ థియేటర్ యాజమాన్యానికి భీమిలి టౌన్ ప్లానింగ్ అధికారులు వేలాది రూపాయల జరిమానా కూడా విధించారు. అయినా కూడా అనుమతి లేకుండా ఇంటి గోడలు, ప్రభుత్వ స్థలాలపై ప్రచార పోస్టర్లు, స్టిక్కర్లు రోజూ వెలుస్తూనే ఉన్నాయి. జీవీఎంసీ కమిషనర్ హెచ్చరికలను ఇటు శానిటేషన్, అటు టౌన్ ప్లానింగ్ అధికారులు ఖాతరు చేయకపోవడంతో సెప్టిక్ క్లీన్ ట్యాంకర్ల యజమానులు రెచ్చిపోతున్నారు. గత నెల సంక్రాంతి పర్వదినం సమయంలో ఇళ్ల యజమానులు వేలాది రూపాయలు వెచ్చించి ఇళ్లకు పెయింటింగ్ పనులు చేయించుకుంటే... ఆ గోడలపై స్టిక్కర్లు అంటించి గలీజు చేస్తున్నారు. ఇళ్ల యజమానులు స్టిక్కర్లను ఊడదీసిన చోట పెయింట్ ఊడి మరకలు కనిపిస్తున్నాయి.

ఇంటి యజమానుల గగ్గోలు... జీవీఎంసీ అధికారుల మౌనం...

వాస్తవానికి ప్రచారం నిమిత్తం విద్యుత్ స్తంభాలపై పోస్టర్లు, పెయింటింగ్‌లు వేయించినా, సెల్‌ఫోన్, కేబుల్ టీవీల వైర్లు కట్టినా విద్యుత్ సంస్థలకు కొంత రుసుము చెల్లించాల్సి వుంటుంది. అయితే లక్షలాది రూపాయల ఖర్చు చేసి నిర్మించుకున్న ఇళ్ల గోడలపై స్టిక్ నో బిల్స్ (నోటీసులు అంటించరాదు) అని రాయించినా... సెప్టిక్ క్లీన్ ట్యాంకర్ల యజమానులు ఖాతరు చేయడం లేదు. జీవీఎంసీలో కొన్ని విభాగాలకు ప్రతి నెలా వీళ్లు మామూళ్లు కడుతుండడంతో గోడలు ఖరాబు అయినా తమకెందుకు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. రోజూ ప్రజల మధ్య తిరుగుతుండే జోనల్ కమిషనర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వీటిని పట్టించుకోకపోవడంతో గోడలను గలీజు స్టిక్కర్లతో నింపేస్తున్నారు. వీటికి అడ్డుకట్టు వేయాల్సిన పబ్లిక్ సర్వెంట్లు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుంటడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజావసరాల కోసం స్థలం శుభ్రత

కొండవాలు వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి చర్యలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్ కొండవాలు ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలాన్ని ప్రజావసరాల కోసం వినియోగించేలా చూడాలని ఇటీవల కాలనీ వాసులు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్పందించిన ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టారు. శనివారం జీవీఎంసీ సిబ్బంది ఈ పనులు నిర్వహిస్తున్న సమయంలో.. అవి నచ్చని కొందరు దేవస్థానం సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దేవస్థానం సిబ్బంది, జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకులు ఈ స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ స్థలాన్ని చదును చేయిస్తే ప్రజావసరాల కోసం వినియోగించుకుంటామని అధిక శాతం స్థానికులు మరోసారి తెలియజేశారు. తామంతా కొండపై నివసిస్తున్నామని, ఎవరైనా చనిపోతే పైకి తీసుకెళ్లలేమని, రోడ్డుపై వేయలేమని.. అటువంటి సందర్భాల్లో, రాత్రి వేళల్లో తమ ద్విచక్ర వాహనాలను పార్క్ చేసుకునేందుకు, చిన్న చిన్న కార్యక్రమాల నిర్వహణకు ఈ స్థలాన్ని వాడుకుంటామని కోరారు. స్పందించిన అధికారులు కాలనీ నాయకుల నుంచి హామీ తీసుకుని జీవీఎంసీ సిబ్బంది, సత్యసాయినగర్ వాసుల సహాయ, సహకారాలతో ఈ స్థలాన్ని శుభ్రం చేయించారు.

జనసేన నాయకుల హడావుడి..

అదే సమయంలో అక్కడికి చేరుకున్న జనసేన ఉత్తర నియోజకవర్గ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, వార్డు నాయకుడు తుమ్మల త్రినాథ్‌లు ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూశారు. కాలనీవాసులు, వైఎస్సార్‌సీపీ, టీడీపీల నాయకులు ప్రజావసరాల కోసం చేస్తున్న ఈ మంచి పనిని అడ్డుకోవడం తగదని తెలియజేయడంతో వారు తిరిగి వెళ్లిపోయారు.



సత్యసాయినగర్ కొండవాలులో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కేంద్ర పథకాలపై ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

తగరపువలస: బీజేపీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కంటుబుక్త రామానాయుడు ఆధ్వర్యంలో శనివారం గావ్ చలో అభియాన్ కార్యక్రమం దాకమర్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, తదితరులు నాయకులు, కార్యకర్తలతో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరుపై అడిగి తెలుసుకుని, ప్రచారం చేశారు.